క్లుప్తంగా

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే

రాంగోపాల్‌పేట్: నియోజకవర్గంలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అన్నారు. బుధవారం మోండా డివిజన్‌లోని ఎరుకలబస్తీలో రూ.19లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రమణారెడ్డి పిట్ల నగేష్, నివేదిత, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించే సత్తా బీజేపీకే ఉంది: మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రస్తుత పరిస్థితుల్లో అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను ఓడించే సత్తా ఒక్క బీజేపీకే ఉందని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బుధవారం బేగంపేటలోని ఆయన కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దయానంద్‌రావు, నర్సింగరావు, సదానంద, వివేక్‌రావు, నరేష్‌కుమార్, సంజయ్ కుమార్, గోపాలకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, జగదీష్, వేణు తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక

సనత్‌నగర్: పదవికి మరింత వన్నె తెచ్చేలా సమర్థవంతంగా పనిచేసి క్రీడాకారుల మన్ననలను పొందాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఆంజనేయగౌడ్ బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను మంత్రి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

కంటోన్మెంట్: పోలీసు ఉద్యోగాల ప్రిలిమినరీ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 500 మందికి పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ కార్యదర్శులు సందీప్ హరి, గద్దె భాస్కర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 8న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సంగారెడ్డి, వరంగల్ కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. అర్హత పరీక్షలో రాణించిన తొలి 200 మందికి ఉచిత భోజన వసతితో పాటు శిక్షణ, మరో 300 మందికి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మరో 500 మందికి స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. తుది పరీక్ష జరిగేంత వరకు కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు పరవస్తు ఫేస్‌బుక్ పేజీ, వెబ్‌సైట్ లేదా 89191 82470, 79818 88150 నంబర్లతో సంప్రదించాలని సూచించారు.

ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద నిరసన

సనత్‌నగర్: లారీల్లో తీసుకువచ్చిన ధాన్యాన్ని సనత్‌నగర్‌లోని ఎఫ్‌సీఐ గిడ్డంగిల్లోకి అనుమతించకపోవంతో మెదక్ మున్సిపల్ చైర్మన్, మెదక్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు టి.చంద్రపాల్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు, మిల్లర్లు ధర్నాకు దిగారు. బుధవారం ఎఫ్‌సీఐ గిడ్డంగుల్లోకి లారీలను అనుమతించకోవడంతో లారీ డ్రైవర్లు చంద్రపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి సమస్యను తెలుసుకునేందుకు ఎఫ్‌సీఐ అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఆయనతో పాటు లారీ డ్రైవర్లను లోనికి అనుమతించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చంద్రపాల్‌తో సహా లారీ డ్రైవర్లు, మిల్లర్లు గిడ్డంగుల గేటు ముందు బైటాయించారు. గిడ్డంగులు ధాన్యంతో నిండిపోయాయని, చోటు లేదని ఎఫ్‌సీఐ అధికారులు నచ్చ చెప్పేందుకు ప్రయత్నించారు. దూరం నుంచి ధాన్యాన్ని లారీల్లో తీసుకువచ్చిన తరువాత అనుమతించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మిల్లర్లు, లారీ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ డిపో డీపీఎం వచ్చి లారీలను అనుమతించేందుకు అంగీకరించిన తరువాత ఆందోళన విరమించారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ బంపర్ డ్రా



రూ.50లక్షల లక్కీ డ్రా కూపన్ చూపిస్తున్న నటుడు కిరణ్ అబ్బవరం, నటి సిమ్రాన్ చౌదరి

సాక్షి, సిటీబ్యూరో: బజాజ్ ఎలక్ట్రానిక్స్ గ్రాండ్ బంపర్ డ్రా కార్యక్రమాన్ని బుధవారం కేపీహెచ్‌బీలోని నెక్సెస్‌మాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సినీనటుడు కిరణ్ అబ్బవరం, నటి సిమ్రాన్ చౌదరి పాల్గొని లక్కీ డ్రా తీశారు. కూపన్ నం.22092303809 వినియోగదారుడికి రూ.50లక్షల క్యాష్ ప్రైజ్ దక్కిందని బజాజ్ ఎలక్ట్రానిక్స్ జీఎం హబీబ్ తెలిపారు. అదే విధంగా 40 ఆల్టో కార్లను తమ వినియోగదారులు గెలుచుకున్నారని పేర్కొన్నారు.

ఓయూలో ముగిసిన అలుమ్నీ మీట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రతిష్టాత్మంగా తొలిసారి చేపట్టిన గ్లోబల్ అలుమ్నీ మీట్–2023 ముగిసింది. బుధవారం యూనివర్సిటీ క్యాంపస్ అంతట పూర్వవిద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. క్యాంపస్‌లోని 8 కళాశాలలు, అందులోని వివిధ విభాగాలలోని (డిపార్టుమెంట్స్) తరగతి గదుల్లో పూర్వవిద్యార్థులు పర్యటించారు. సహచర విద్యార్థులు (క్లాస్‌మేట్స్) కనిపించగానే పట్టలేని ఆనందంతో ఆలింగనం చేసుకొని, యోగక్షేమాలు, వృత్తి, కుటుంబం, పిల్లల వివరాలు తదితర అంశాల పై ముచ్చటించుకున్నారు. కాలేజీల్లో చదివే రోజుల తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం పూర్వవిద్యార్థులు ప్రస్తుత విద్యార్థులతో కలిసి వివిధ అంశాల పై చర్చించుకొని హాస్టల్ మెస్‌లో భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు 'సాక్షి'తో మాట్లాడుతూ, తాము చదవే రోజుల్లో స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్, వైఫై తదితర అత్యధునిక సాంకేతిక పరిజ్ఞానం లేదని, ప్రస్తుతం క్యాంపస్ అంతటా ఉచిత వైఫై సదుపాయం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో పెరిగిన పచ్చదనం, నెలకొన్న



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఆహ్లాదకర వాతావరణం చూసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా వీసీ రవీందర్, ప్రముఖులు ఎ.నరసింహారెడ్డి, బుర్రా వెంకటేశం, సి.రాజశేఖర్, సీవీ ఆనంద్, మోహన్‌రెడ్డి, శేఖర్ కమ్ముల తదితరులు పాల్గొన్నారు.

రూ. కోట్ల విరాళాలు

ఓయూ గ్లోబల్ అలుమ్నీ మీట్ సందర్భంగా వివిధ సంస్థలు వ్యక్తుల నుంచి ఓయూకు రూ.2 కోట్ల విరాళం లభించింది. ఎస్‌ఎస్‌యూ చెందిన గోపాల్ రావు మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం అభివృద్ధి కోసం రూ.80 లక్షలను అందజేశారు.

సమాజం పట్ల బాధ్యతగా ఉంటాం..

సాహిత్య అధ్యయనంలో సమాజం పట్ల బాధ్యతగా ఉంటామని తెలంగాణ సాహిత్య అకాడమి తొలి చైర్మన్ డా. నందిని సిధారెడ్డి అన్నారు. గ్లోబల్ అలుమ్నీ మీట్ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో సాహిత్యంపై ఆర్ట్స్ కాలేజీలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సీఎం కార్యాలయం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్, తెలుగు వర్సిటీ మాజీ వీసీ ప్రొ.సత్యనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, హెడ్ ప్రొ.కాశీం పాల్గొన్నారు.

విస్తృతంగా అభివృద్ధి పనులు: డిప్యూటీ స్పీకర్

సికింద్రాబాద్: విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడం ద్వారా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ చెప్పారు. బుధవారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయ భవన నిర్మాణ పనులను పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో నియోజకవర్గంలో పలు భారీ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. వార్డు కార్యాలయంతో పాటు దాదాపు రూ.100 కోట్ల మేర అభివృద్ధి



నామాలగుండులో వార్డు కార్యాలయ భవనం పనులను ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, టీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం: సాయన్న

కంటోన్మెంట్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే సాయన్న అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 23 మంది కల్యాణ లక్ష్మి, /షాదీముబారక్ లబ్ధిదారులకు కార్ఖానాలోని తన క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఎనిమిదేళ్లుగా సంక్షేమ రాజ్యం నడుస్తోందన్నారు. కంటోన్మెంట్లోనూ ప్రతి నెలా పదుల సంఖ్యలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, శ్యామ్ కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు నివేదిత, ముప్పిడి మధుకర్, సదానంద్ గౌడ్, పనస సంతోష్, తేజ్‌పాల్, నాగినేని సరిత, నారాయణ ముదిరాజ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం..

మోండా డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో పూర్తిస్థా



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయన్న

యిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే సాయన్న అన్నారు. ఎరుకల బస్తీలో రూ.19 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత మంచినీరు ఇస్తున్నామన్నారు. మోండా డివిజన్‌లో పలు బస్తీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేసి, దశలవారీగా పనులు చేపడుతున్నామన్నారు.

ఐదునెలల్లో అందుబాటులోకి మాతాశిశు సంరక్షణ కేంద్రం

తెలంగాణ డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మాతాశిశు సంరక్షణ కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఐదు నెలల్లో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం నిర్మాణ పనులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రిని మెటర్నిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మెటర్నల్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) భవన నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు కేటాయించిందని, నిపుణులైన వైద్యులు, అత్యాధునిక ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, సకల సదుపాయాలతో 200 పడకలు ఏర్పాటు చేస్తు



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

న్నామని వివరించారు.

మూడు నెలల్లో డైట్ కిచెన్...

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.2.75 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న డైట్ కిచెన్ భవనాన్ని మూడు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని డీఎంఈ రమేష్ రెడ్డి తెలిపారు. డైట్ కిచెన్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సకాలంలో చిన్నారులకు టీకాలు వేయించండి

సనత్‌నగర్: నిర్దేశిత సమయం ప్రకారం చిన్నారులకు టీకాలు వేయించి వారి ఆరోగ్య జీవితానికి తల్లిదండ్రులు పునాదులు వేయాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. తొమ్మిది నెలల చిన్నారులకు అందించే జేఈ (జపనీస్ ఎంసెఫ్‌హలైటిస్) టీకా ఫస్ట్ డోసుతో పాటు ఎఫ్‌ఐపీవీ (ఫ్రాక్షన్ ఇన్ యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్) మూడో డోస్ వ్యాక్సినేషన్‌ను బుధవారం ఆమె సనత్‌నగర్ యూపీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి బుధవారం చిన్నారులకు యూపీహెచ్‌సీల్లో అందించే టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ సౌమ్య, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం, రుక్మిణిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

అమీర్‌పేట: సనత్‌నగర్ కేఎల్‌ఎన్‌వై మున్సిపల్ పార్కులో నెలకొన్న సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్తామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌రావు అన్నారు. కొన్ని చోట్ల లైట్లు వెలగని కారణంగా బుధవారం ఉదయం 5 గంటల సమయంలో వాకింగ్‌కు వచ్చిన ఇద్దరు వయోవృద్ధులు అదుపు తప్పి కింద పడిపోయారని తెలిపారు. గ్రేటర్‌లోనే అత్యుత్తమ పార్కుగా తీర్చిదిద్దేందుకు మంత్రి తలసాని ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో పార్కులో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారం లభిస్తోందన్నారు. దీంతో పాటు ఓపెన్ జిమ్‌లో మరికొన్ని వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రికి వివరిస్తామని చెప్పారు. ఆయన వెంట అసోసియేషన్ సభ్యులు చారి, చంటిరాజు, సోను, షాబాద్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం

సనత్‌నగర్: అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాకళికలు రూపొందించి దశలవారీగా పనులు చేపట్టడం జరుగుతుందని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలో గల భగత్‌సింగ్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుల సహకారంతో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల మృత్యువాత ఘటనలో.. వినాయక గ్రౌండ్ సందర్శన

సనత్‌నగర్: వినాయక గ్రౌండ్‌లో అరుదైన జాతులకు చెందిన పక్షులు మృత్యువాతపడిన ఘటనలో అటవీ సిబ్బంది బుధవారం మరోసారి గ్రౌండ్‌ను సందర్శించారు. మంగళవారం రాత్రి మృతి చెందిన పక్షులను అటాప్సీ నిమిత్తం జూ పార్కుకు తరలించిన అధికారులు స్థానికుల నుంచి అందిన సమాచారం ఆధారంగా మరోసారి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గ్రౌండ్ ఆవరణలో పురుగులు పట్టి శిథిలమవుతున్న రావి చెట్టు కొమ్మను సిబ్బంది సేకరించి తీసుకువెళ్లారు. పురుగుపట్టి శిథిలమవుతున్న చెట్లను కాపాడే క్రమంలో స్థానికులు కొందరు రసాయనాలను పిచికారీ చేసి ఉంటారని, ఈ క్రమంలోనే పక్షులు రావి చెట్టు పైకి చేరి మందుల ప్రభావానికి లోనై చనిపోయి ఉంటాయని అటవీ సిబ్బంది భావిస్తున్నారు. దీంతో చెట్ల కొమ్మలను, చెట్టుకు పట్టిన చీడను సేకరించి తీసుకువెళ్లారు.

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

లాలాపేట: రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ (విజయ డెయిరీ) చైర్మన్ సోమ భరత్‌కుమార్ బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



అభివృద్ధి పనులకు ముహూర్తం ఖరారు చేయండి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, కొత్త పనుల ప్రారంభోత్సవానికి కార్యాచరణ సిద్ధం చేయాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అడ్డగుట్ట, తార్నాక, సీతాఫల్‌మండిలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి జీఎం పీవీ రమణారెడ్డి, డీజీఎం కృష్ణ, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి,డిప్యూటీ కమిషనర్ దశరథ్, వైద్యశాఖ అధికారులు సక్కుబాయి, రాజశ్రీ, రవీందర్‌గౌడ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ, అడ్డగుట్ట, లాలాపేటలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలన్నారు. త్వరలో నిర్మించే ఆసుపత్రి భవనం, ఆర్‌యూబీ వంతెనల నిర్మాణం పనుల ప్రారంభం కోసం చర్చలు జరిపారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు హేమ, ప్రసన్నలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన...

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ బుధవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, రోగులతో మాట్లాడారు. అతిత్వరలో అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తొలగించి దాని స్థానంలో 50 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

లాలాపేటలోఆకస్మిక పర్యటన...

లాలాపేట: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ బుధవారం సాయంత్రం లాలాపేటలో పర్యటించారు. లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శిథిలావస్థకు చేరిన హాస్పిటల్ భవనాలను చూసి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తిగా తొలగించి నూతన భవనాల నిర్మాణం చేయాలని కోరగా, మంత్రి త్వరలో ఆసుపత్రిని సందర్శించి వచ్చే బడ్జెట్‌లో నూతన భవనానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

రికార్డు స్థాయిలో పాస్‌పోర్టు సేవలు

పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య



రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఆధ్వర్యంలో గతేడాది రికార్డు స్థాయిలో పాస్‌పోర్టు సేవలు అందించినట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది 6,62,028 దరఖాస్తులు రాగా అందులో 6,59,317 పాస్‌పోర్టులు, పీసీసీలు అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ పాస్‌పోర్టు సేవల ద్వారా రూ.118 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. 2019 సంవత్సరంలో 5,56,000 దరఖాస్తులు రాగా 5,54,782 పాస్‌పోర్టులు అందించామని, 2020 సంవత్సరంలో (కరోనా సమయం) 2,95,622 దరఖాస్తులకు గాను 2,93,143 పాస్‌పోర్టులు, 2021(కరోనా సమయం)లో 4,45,635 దరఖాస్తులకు గాను 4,42,509 పాస్‌పోర్టులతో పాటు పాస్‌పోర్టు సేవలు అందించామన్నారు. 2019 సంవత్సరంలో 109 మంది స్టాఫ్, 2020లో 101 మంది స్టాఫ్, 2021లో 99 మంది స్టాఫ్ ఉండగా గతేడాది కేవలం 95 మంది స్టాఫ్‌తో రికార్డు స్థాయిలో సేవలు అందించినట్లు తెలిపారు. గతేడాది 4 ప్రత్యేక మేలాల ద్వారా సాధారణ, తాత్కాల్ దరఖాస్తులు పరిశీలించామని, విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లే వారికి అవసరమయ్యే పీసీసీల కోసం రెండు ప్రత్యేక మేలాలు నిర్వహించి జాప్యాన్ని తగ్గించామని తెలిపారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేద్దాం: జెడ్సీ

సికింద్రాబాద్: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా సత్వరంగా అభివృద్ధి పనులు పూర్తి చేయవచ్చునని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఉత్తర మండలం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. సికింద్రాబాద్, బేగంపేట, ముషీరాబాద్, అంబర్‌పేట, మల్కాజిగిరి సర్కిళ్లకు చెందిన జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ పోలీస్ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జలమండలి, విద్యుత్‌శాఖల అధికారులు తాము చేపడుతున్న అభివృద్ధి పనుల ముందస్తు సమాచారాన్ని ఆయా సర్కిళ్ల జీహెచ్‌ఎంసీ అధికారులకు అందించాలన్నారు. ఫలితంగా రోడ్డు నిర్మాణాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. జలమండలి జీఎం రమణారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ అనిల్‌రాజ్, సిటీ ప్లానర్ ప్రదీప్, ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ అధికారులు సంతోష్, మెగారాణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి సమస్యను పరిష్కరించాలని వినతి

రాంగోపాల్‌పేట్: ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి సమస్యను పరిష్కరించి నిజమైన భక్తసింగ్ అనుచరులైన ట్రస్టు సభ్యులకు బాధ్యతలు అప్పగించేలా చొరవ తీసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను భారత క్రిష్టియన్ కౌన్సిల్ ఫౌండర్ ప్రెసిడెంట్ బిషప్ ముల్కల భాస్కర్, సభ్యులు జరుసలేం మత్తయ్యలు కోరారు. ఈ మేరకు బుధవారం మారేడుపల్లిలోని మంత్రి నివాసంలో వారు ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. హెబ్రోన్ చర్చి వివాదంలో హైకోర్టు ఎఫ్‌సీఎస్ పీటర్ ఆధ్వర్యంలో ట్రస్టుకు అనుకూలంగా తీర్పు అందించిందని, ఇందులో పోలీసులు, రాజకీయ నాయకులు సహకరించకపోవడంతో చర్చి నిర్వహణ బాధ్యతలు ట్రస్టు చేపట్టలేకపోతుందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఈ చర్చిలో అన్ని వ్యవహారాలు జరిగేలా చట్ట ప్రకారం పూర్తి సహకారం అందించాలని వారు మంత్రికి విన్నవించారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి



టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఇప్పించి భవిష్యత్‌లో వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి వారిని కాపాడాలనీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జాతీయ వ్యాధి నిరోధక జేఈ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత మాట్లాడుతూ, చిన్నారులకు జపనీస్ ఇన్‌సఫలైటీస్ (మెదడు వాపు వ్యాధి) రాకుండా టీకా అడ్డుకుంటుందన్నారు. ఈ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 12 నెలల వరకు, 16 నుంచి 24 వరకు పిల్లలకు రెండు డోసులు ఇస్తామన్నారు. మొదటి రోజు ముగ్గురు చిన్నారులకు టీకాలు ఇచ్చామన్నారు. సూపర్‌వైజర్ స్వరూప, వైద్య సిబ్బంది సత్యవతి, గీత, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మా తండ్రి ఎమ్మెల్సీ అంటూ.. మోసాలకు తెరలేపిన వ్యక్తిపై కేసు



నిందితుడు కార్తీక్‌రెడ్డి

అమీర్‌పేట: మా తండ్రి ఎమ్మెల్సీ అంటూ శిక్షణా సంస్థ నిర్వాహకుడ్ని మోసం చేసి డబ్బులు దండుకున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్య వంశీ ప్రకాష్ అనే వ్యక్తి ప్రైమ్ ఆస్పత్రి సమీపంలోని నాగసాయి నివాస్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్.403లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాడు. గతేడాది జూలైలో కార్యాలయంకు వచ్చిన ఓ వ్యక్తి తన పేరు కార్తీక్‌రెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. తన తండ్రి రాంమోహన్‌రెడ్డి అనంతపూర్‌లో ఎమ్మెల్సీ అని, ఓ రాజకీయ పార్టీలో మంచి స్థానంలో ఉన్నారని తెలిపాడు. తెలంగాణలో ఉన్న ఆ రాజకీయ పార్టీలో తనకు నగర అధ్యక్ష పదవిని ఇస్తున్నారని నమ్మించాడు. తాను కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తానని చెప్పి కోచింగ్ కోసం అదే ఫ్లాట్‌లో కొంత భాగం ప్రతి నెల రూ. 15 వేల అద్దె, అడ్వాన్సు కింద రూ.40 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. మాయ మాటలు చెప్పి ప్రకాష్ వద్ద విడతల వారీగా రూ.27 లక్షల వరకు అప్పు చేశాడు. ఓ రోజు రాంమోహన్‌రెడ్డిని అంటూ ఓ వ్యక్తి ప్రకాష్‌కు ఫోన్ చేయించి మాకు వరంగల్‌లో కూడా చాలా భూములు ఉన్నాయని చెప్పాడు. కార్తీక్‌రెడ్డి అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి వాకబు చేయగా అతడు అమీర్‌పేట అంకమ్మనగర్ బస్తీకి చెందిన వ్యక్తిగా తెలిసింది. దీంతో మోసపోయానని భావించిన ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

యువకుడి మృతి

అమీర్‌పేట: ద్విచక్ర వాహనం ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా అమరావతికి చెందిన ఎస్.గోపికృష్ణ(27) ఎంబీఏ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం గతేడాది నవంబర్ మాసంలో నగరానికి వచ్చాడు. ఎస్ఆర్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటున్న కృష్ణ ఈ నెల 1న రాత్రి 8.30 గంటల సమయంలో స్నేహితుడు మణికంఠతో కలిసి ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా పల్సర్ వాహనం ఢీకొట్టింది. తల పగిలి తీవ్ర గాయాలకు గురైన కృష్ణను అమీర్‌పేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి శ్రీదేవి, సాంబశివరావు దంపతులకు గోపికృష్ణ ఏకైక సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పార్కింగ్ చేసిన ఆటో మాయం

సనత్‌నగర్: పార్కింగ్ చేసిన ఆటో మాయమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ జయచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాలాజీనగర్ గబ్బిలాల్‌పేటకు చెందిన అర్జున్(46) హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థలో కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 2న ఉదయం 11.30 గంటల ప్రాంతంలో తన ఆటో(ఏపీ28వీ0936)ను రసూల్‌పురా మెట్రో స్టేషన్ వద్ద పార్కు చేసి విధులకు వెళ్లాడు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి రాగా తాను పార్కు చేసిన ఆటో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు తన ఆటోను దొంగిలించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆటో రూ.40,000ల విలువ ఉంటుందని పోలీసులకు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ..

ఓ వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఫోన్‌ను తస్కరించుకుపోయిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జయచంద్రా తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మంకమ్మతోట ప్రాంతానికి చెందిన జి.వెంకట నరసింహ(25) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 2న రాత్రి 11 గంటల సమయంలో తన ఊరు వెళ్లేందుకు ప్యారడైజ్ నుంచి జేబీఎస్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే క్రమంలో ఫోన్ మాట్లాడుతుండగా వెనుక నుంచి ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు వెంకట నరసింహ ప్రయత్నించే క్రమంలో కిందపడిపోయాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం బ్యాటరీల దొంగ అరెస్ట్



నిందితుడు శివరామ్

చిలకలగూడ: ఏటీఎం సెంటర్లలో బ్యాటరీలు చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌పై నివసించే గుడిపల్లి శివరామ్ (42) సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలు వృత్తిగా ఎంచుకున్నాడు. గతేడాది నవంబర్ 28వ తేదీ అర్ధరాత్రి పద్మారావునగర్‌లోని ఐసీఐసీఐ ఏటీఎం సెంటర్‌లోకి చొరబడి బ్యాటరీలను దొంగతనం చేశాడు. ముంబై మెయిన్ బ్రాంచ్ సర్వేలెన్స్ సిబ్బంది గుర్తించి స్థానిక ఏటీఎం నిర్వహణ మేనేజర్ విజయ్‌కు సమాచారం అందించగా అతను పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలలో గుడిపల్లి శివరామ్‌ను నిందితుడిగా గుర్తించి గాంధీఆస్పత్రి సమీపంలో బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు సెల్‌ఫోన్ స్నాచర్ల అరెస్టు

చిలకలగూడ: ఇరువురు సెల్‌ఫోన్ స్నాచర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌గడ్డకు చెందిన భవాని(25) ఉప్పల్ జెన్‌పాక్ట్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగి. గతేడాది డిసెంబర్ 6వ తేదీ రాత్రి 8 గంటలకు కుటుంబసభ్యులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ చిలకలగూడ చౌరస్తా నుంచి మైలార్‌గడ్డకు నడుచుకుంటూ వస్తోంది. అమర్ టాకీస్ గల్లీ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని దుండగుడు భవాని చేతిలోని ఫోన్ గుంజుకుని బైక్‌పై ఉన్న మరో వ్యక్తితో కలిసి క్షణాల్లో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి పార్శిగుట్టకు చెందిన ధర్మారపు వినయ్(19), మేడిగ సందీప్‌కుమార్(20)లను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.